సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 105 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 15.08.2025






## సహాయక చర్యలకు
# జిల్లా రూ.కోటి

- 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండండి
- తక్షణ సహాయ చర్యలకు సిద్ధం కావాలి
- మంత్రి పొంగులేటి

2 లో











# స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

## పరిశీలించిన కలెక్టర్, డీపీసీ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని ధర్మకంచ మినిస్టేడియంలో శుక్రవారం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని 9.30 గంటలకు జాతీయ పతాకం అవిష్కరిస్తారని తెలిపారు. 9.35 గంటల నుంచి 9.40 గంటల వరకు పోలీస్ శాఖ గౌరవ వందనం, తర్వాత ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రసంగం ద్వారా ప్రజలకు తెలియజేస్తారని పేర్కొన్నారు. 10 గంటల నుంచి 10.50 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు,10.50 గంటల నుంచి 11.20 గంటల వరకు ఉత్తమ సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, పోలీస్ శాఖ ఉద్యోగులకు, ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. అంతకుముందు కలెక్టరేట్ లో జాతీయ పతాకం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు.



మన చౌరాస్తా
The Complete News way
15.08.2025 శుక్రవారం
Mana Chourasta
2

# జిల్లాకు రూ.కోటి విడుదల

**హైదరాబాద్, మన చౌరాస్తా :**

వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఈ వీసీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవోలు, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

- 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండండి
- తక్షణ సహాయ చర్యలకు సిద్ధం కావాలి
- విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి








# మాల్ బౌలి పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**నల్లగొండ, మన చౌరాస్తా :** పట్టణంలోని షేర్ బంగ్లా వద్ద ఉన్న మాల్ బౌలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కోలాటం పాటలు పాటలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఆనంద ఉత్సవాలతో ఉట్లు కొట్టారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఎం.డి యూసుఫ్, ఉపాధ్యాయులు యాలాద్రి, హబీబ్ రెహమాన్ జుబేర్, సుశీల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అత్యాచారం చేసిన నిందితులను

# కఠినంగా శిక్షించాలి

**జనగామ, మన చౌరాస్తా :** యువతిపై సామూహిక అత్యాచారం చేసిన మృగాలను కఠినంగా శిక్షించాలని ఐద్వా, కేవీపీఎస్ డిమాండ్ చేశాయి. గురువారం ఐద్వా, కేవీపీఎస్ జనగామ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా సిద్దిపేట బస్ స్టాప్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ మాట్లాడుతూ జనగామ పట్టణంలో ప్రేమ పేరుతో అమ్మాయిని మోసం చేసి తీసుకువెళ్లిన యువకుడు తన స్నేహితులతో కలిసి సామూహిక అత్యాచారం చేయడం హేయమైన దుర్మార్గమైన చర్య అన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువత పెడదారులు పోవడానికి కారణమైన నిరుద్యోగం, మద్యం, డ్రగ్స్, గంజాయి, అశ్లీల చిత్రాలు సెల్ ఫోన్లులో వచ్చే అటువంటి అశ్లీలతపై నియంత్రణ లేకపోవడం కూడా ఒక కారణమన్నారు. వీటిని నియంత్రించడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పందిళ్ళ కళ్యాణి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తోటి దేవదానం, ఉపాధ్యక్షులు పల్లెర్ల లలిత, బి.శ్రావణ్, ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు వరలక్ష్మి, విజయ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రంలోని మాతమ్మ తల్లి, పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. శివ సత్తుల పూనకాలతో పోతురాజుల ఆటల కోలాహంతో బోనాల ర్యాలీ సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అందరినీ చల్లగా చూడాలని వర్షా లు బాగా కురిసి పాడిపంటలు పండాలని ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అల్వాల ఎల్లయ్య, పైసా బిక్షపతి, గంధ మల్ల జంపయ్య, కర్రే శ్రవణ్ కుమార్, రాగిశెట్టి అబ్బ సాయిలు, భావండ్లపల్లి యాదగిరి, అలవాల నర్సింగరావు, అల్వాల రాజు, అల్వాల నవీన్, దయాకర్, ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు సురక్షితంగా ఉండాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాతావరణ శాఖ చేసిన భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం రఘునాథపల్లి మండలంలోని బానాజీపేట, రఘునాథపల్లిలలో పర్యటించారు. వరదతో పొంగి పొర్లుతున్న వాగులు, వంకలను పరిశీలిస్తూ తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిల భవనాల్లో, మట్టి ఇండ్లలో, రేకుల షెడ్ లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. దోమలు ప్రబలే అవకాశం ఉన్నందున సీజనల్ వ్యాధులు సోకకుండా, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో మాట్లాడారు. వర్షాలకు తడిసిన కరెంట్ స్తంభాలు తాకరాదని, వాగులు దాటరాదని, కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, విపత్కర పరిస్థితులల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ కు 9052308621 సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఫణికిషోర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



### బతుకమ్మ కుంట పనుల పరిశీలన

**జనగామ :** పట్టణంలోని మునిసిపాలిటీ పరిధిలో రూ.1.50 కోట్లతో చేపట్టిన బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను గురువారం సంబంధిత అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ముందుగా చెత్త చెదారం తొలగించాలని, ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పనులు వేగవంతంగా చేపడుతూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అందమైన పూల మొక్కలు నాటించాలన్నారు. కలెక్టర్ వెంట ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# 16వ రోజుకు చేరిన రిలే దీక్షలు

**జనగామ, మన చౌరాస్తా :** మండలంలోని వడ్లకొండ, గానుగుపహాడ్‌లలో వంతెనలు నిర్మించాలని కలెక్టరేట్ మందు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బ్రిడ్జి సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెండు వారాలుగా తాము దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం విచారకరం అన్నారు. దీక్షలో ఓయూ జేఏసీ నేత శివరామ్ గౌడ్, గందమల్ల సదానందం, జనగామ జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, కర్ల మనోహర్ రెడ్డి, సిరన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గండి నాగరాజు, ముక్క స్వామి, భిక్షపతి, సంపత్ పాల్గొన్నారు.




# అధైర్య పడొద్దు అండగా ఉంటాం..

**వరంగల్, మన చౌరాస్తా :** పునరావాస కేంద్రంలో ఉన్న వారు అధైర్య పడవద్దని జిల్లా యంత్రాంగం అండగా ఉందని డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ నగరంలోని జలమయమైన లోతట్టు ప్రాంతాలైన రాం మందిర్ నిర్వాసితులకు పోతన రోడ్‌లోని మరాఠీ భవన్‌లో నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాన్ని సాంబశివరావు గురువారం సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సదుపాయాలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. బీపీ పరీక్షించి ఎక్కువ ఉన్న ఇద్దరినీ అంబులెన్స్ ద్వారా ఎంజీఎం హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పునారావస కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదని, జిల్లా యంత్రాంగం అహర్నిశలు ప్రజల రక్షణ కోసం పాటుపడుతుందని, ఎవరూ ఆందోళన చెందకూడదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ ఎం.జీ.ఎం హాస్పిటల్ డాక్టర్ మేరుగు యశస్వినీ, పి.పి యూనిట్ సూపర్ వైజర్ నర్మద, ఏఎన్ఎంలు కోమల, లక్ష్మీబాయి, రాజా సులోచన, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ సంబురాలు

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్-2 సినిమా విడుదల సందర్భంగా గురువారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. అభిమానులు థియేటర్ వద్ద కేకలు, చప్పట్లతో సందడి చేస్తూ సినీ వేడుకను పండుగలా మార్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి కార్తీక్, ఉపాధ్యక్షుడు వడ్లకొండ శివ గౌడ్, కోశాధికారి సిహెచ్.రాజేందర్, డి.నాగరాజు, శ్రీకాంత్, ప్రశాంత్, నాగరాజు, భానుగౌడ్, ఎల్.రమేష్, అశోక్, సునీల్, రమేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

**జనగామ, మన చౌరాస్తా :** నర్మెట మండలం వెల్దండలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకొని హైకోర్టును ఆశ్రయించిన వెల్దండ గ్రామ నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, ఉపేందర్, పట్టణ కమిటీ సభ్యులు మంగ బీరయ్య, బాధితులు శివగాని సావిత్రి, చందం చంద్రకళ, బెల్లి కొమరవ్వ, కళ్యాణం కళావతి, అనిత, నాగరాజు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుడి మృతి



**జనగామ టౌన్, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని 2వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు మైలమాల సునీల్ గురువారం బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆయన కుటుంబాన్ని ఫోన్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. 2వ వార్డ్ మాజీ కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుగుల నర్సింహులు, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఉల్లంగుల సందీప్, మడికొండ నర్సింహాలు, సేవెల్లి మధు, పానుగంటి సువార్త తదితరులు సునీల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.




# రూ.50లకే సితారే జమీన్ పర్ స్ట్రీమింగ్

బాలీవుడ్ నటుడు, మిస్టర్ ఫర్ఫెక్ట్ ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'సితారే జమీన్ పర్' చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమ్రింగ్ అవుతున్న విషయం తెలిసిందే. పాపులర్ స్ట్రీమ్రింగ్ ప్లాట్‌ఫామ్ అయిన యూట్యూబ్ లో కేవలం రూ.100లకే ఈ సినిమా ప్రస్తుతం పేపర్-వ్యూ మోడల్‌లో స్ట్రీమ్రింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ సినిమాపై మరో బంఫర్ ఆఫర్‌ని ప్రకటించింది చిత్రయూనిట్. ఇండిపెండెన్స్ డే కానుకగా.. ఈ సినిమాను కేవలం రూ.50లకే అందుబాటులో ఉంచుతున్నట్లు- ప్రకటించింది. దీంతో ఈ సినిమాను చూడాలనుకునేవారు యూట్యూబ్‌లో కేవలం రూ.50 చెల్లిస్తే సరిపోతుంది. ఈ ఆఫర్ ఆగష్టు 15 నుంచి 17 వరకు ఉంటుందని తెలిపింది. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జెనీలియా కథానాయికగా నటించారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్‌ఖాన్, అపర్ణ పురోహిత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. లాల్ సింగ్ చద్దా వంటి డిజాస్టర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని ఆమిర్ ఈ సినిమా చేయడంతో మూవీపై మంచి అంచనాలు ఏర్పడంతో పాటు- మంచి కలెక్షన్లు రాబట్టింది.







# ఆకట్టుకునే 'పరదా'

## నటి అనుపమా పరమేశ్వరన్

**'పరదా' సినిమాతో** ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధానపాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ అనుపమ తన కెరీర్‌కు సంబంధించిన విషయాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఇప్పుడు తాను ఎంతో మారినట్లు చెప్పారు. ఇండస్ట్రీలో కొనసాగడం చాలా కష్టం. ఒక్కోసారి హీరోయిన్స్ అడిగే చిన్న చిన్న విషయాలను కూడా చిత్రబృందం సీరియస్‌గా తీసుకుంటుంది. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా ఎదుర్కొన్నాను. వాళ్లకు నచ్చని విషయాలు చెబితే వెంటనే పొగరు అని అంటారు. చిత్రీకరణ అనుకున్న సమయానికి ఎందుకు ప్రారంభించలేదని అడిగితే యాటిట్యూడ్ ఉందని అంటారు. గతంలో ఇలాంటివి నేను ఎన్నో చూశాను. ఉదయం 7 గంటలకల్లా రెడీ అయితే.. 9.30 వరకు చిత్రీకరణ ప్రారంభించరు. కో స్టార్స్ ఆలస్యంగా వస్తారని తెలిసినా.. నేను మాత్రం ఏడు గంటలకల్లా సిద్ధంగా ఉండాలి. వాళ్ల కోసం గంటన్నర ఎదురుచూడాలి. ఇదే విషయాన్ని టీమ్‌ను అడిగితే పొగరు ఎక్కువైంది అని అంటారు. అలా ఎవరైనా అంటే ఒకప్పుడు బాధపడేదాన్ని.. ఇప్పుడు పట్టించుకోవడం మానేశాను అన్నారు. ఆ గంటన్నరలో సినిమాకు సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించుకోవచ్చు. ఇదే విషయం దర్శకనిర్మాతలతో చెబితే 'నా డబ్బులు కదా నీకెందుకు' అంటారు. ఒకవేళ ఇదే విషయం హీరోలు చెబితే వాళ్లకు ఇలాంటి సమాధానం చెప్పరు. ఇండస్ట్రీలో మాత్రమే కాదు.. బయట కూడా ఇదే పరిస్థితి ఉంది. మహిళలను ఇలానే చూస్తారని అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. 'పరదా' కచ్చితంగా హిట్ కావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయితేనే భవిష్యత్తులో ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తాయని అన్నారు.



# పుష్ప పాటకు బాలయ్య స్టెప్పులు

బాలయ్య మరోసారి తన ఎనర్జీతో అభిమానులను ఉర్రూతలూగించారు. ప్రముఖ నిర్మాత, 'ఆహా' ఓటీటీ అధినేత అల్లు అరవింత్ కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న బాలయ్య, వేదికపై తెగ సందడి చేశారు. ఈ ఈవెంట్‌లో బాలయ్య, అరవింద్ సహా పలువురు ప్రముఖులు ఫుల్ ఫార్మల్ డ్రెస్‌లో స్టేజ్ పై కనిపించారు. మరింత విశేషం ఏంటంటే, వీరంతా మెడలో నిమ్మకాయల హారాలు ధరించి కనిపించారు. ఇక ఈ కార్యక్రమంలో పుష్ప2కి సంబంధించిన ఎనర్జిటిక్ పాట ప్లే అయ్యే క్రమంలో, బాలయ్య తనదైన స్టైల్‌లో తొడకొడుతూ, చిల్ అవుతూ ఆడియన్స్‌కి వినోదం పంచారు. ఇక వేదికపై ఉన్నవారందరూ 'పుష్ప' సినిమా సిగ్నేచర్ మూవ్‌ను రిపీట్ చేస్తూ సర్‌ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'బాలయ్య బాబు తగ్గేదేలే!' అంటూ నెటిజన్లు కామెంట్లు- పెడుతున్నారు. 'ఆహా'లో బాలయ్య హోస్ట్‌గా బాగా హిట్ అయిన టాక్ షో 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్బీకే' కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ షో ద్వారా బాలయ్య టీ-వీ ఆడియన్స్‌కూ మరింత దగ్గరయ్యారు. ఈ నేపథ్యంలో, బాలయ్య - అల్లు అరవింద్ ఒకే వేదికపై కనిపించడం ఫ్యాన్స్‌కు హుషారు తెప్పించింది. వీరిద్దరూ కలసి ఓ సినిమా చేయాలన్న డిమాండ్ సోషల్ మీడియాలో ఊపందుకుంటోంది.

